www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



22 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లి ఆధ్వర్యంలో 22 మందికి ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు చేసినట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నివేదితలు తెలిపారు. శనివారం స్థానిక సొసైటీ కాలనీలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో 22 మందికి ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించి, దృష్టి పరీక్షలు పూర్తి చేసిన అనంతరం వైద్యులు వారికి సలహాలు, సూచనలు చెప్పి, మందులను అందజేశారు. ఈ సందర్భంగా అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ లయిన్స్ క్లబ్ ధ్యేయం అంధత్వ నివారణ అని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా దృష్టి లోపాలు ఉన్న వారిని గుర్తించి వారికీ లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తూ, వారి కుటుంబాలకు కంటి వెలుగులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం నిరంతరం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. కావున కంటిలో శుక్లం ఉన్నవారు లయన్స్ క్లబ్ క్యాంపులను సద్వినియోగం చేసుకొని దృష్టి సమస్యలు లేకుండా పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్ఒ లయన్ గౌతమ్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'తల్లికి వందన'మేదీ!



- 2,50,908 మంది విద్యార్థుల తల్లులు ఎదురుచూపులు
- దసరా వచ్చిన అందని వైనం

ప్రజాశక్తి-రాయచోటి

తల్లికి వందనం రూ.15 వేలు పథకం అమలకు మోక్షం ఎప్పుడాని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడే నాలుగు నెలలు గడిచినా ఎటువంటి స్పష్టత లేకపోవడంతో తల్లిదండ్రులలో ఆందోళన వ్యక్తం అవుతుంది. అన్నమయ్య జిల్లాలో వ్యాప్తంగా 2,775 పాఠశాలలు ఉండగా 2,50,908 మంది విద్యార్థులు ఉన్నారు. రూ.376.362 కోట్లు బడ్జెట్ కావాల్సి వస్తుంది. 2022-23 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద 2,56,657 మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం కింద రూ.228.55 కోట్లు తల్లులకు ఖాతాలో జమ చేశారు.

తల్లిదండ్రుల ఎదురుచూపులు

పేద ప్రజలకు, తల్లి లేని కుటుంబాలకు వారి పిల్లలను పాఠశాలకు పంపడానికి ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో 2020 జనవరి 9న ఈ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల చదివించే పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యార్థులందరికీ పథకాన్ని ఏర్పాటు చేశారు. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం రాగానే ప్రతి ఏడాది ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా కూడా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మఒడిగా ఉన్న పేరును తల్లికి వందనంగా ఈ పథకానికి పేరు మార్చారు. గతంలో ప్రతి ఏటా జూన్ మాసంలో విద్యార్థుల తల్లి ఖాతాలో జమ చేసేవారు. నాలుగు నెలలు గడిచి దసరా వచ్చినా కూడా ఇంతవరకు తల్లికి వందనం రాకపోవడంతో తల్లులు ఆందోళన చెందుతున్నారు.

పథకాన్ని అమలు చేయాలి



తల్లికి వందనం పథకం డబ్బులు వెంటనే తమ ఖాతాలో జమ చేయాలి. ప్రయివేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూని ఫామ్, ఫీజులు కట్టలేకపోతున్నాం. గత ప్రభుత్వంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో చదివి విద్యార్థులకు జూన్ మాసంలోనే అమ్మఒడి పథకాన్ని తల్లులు ఖాతాలో జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు వేయకపోవడం బాధాకరం. ఇచ్చిన హామీ మేరకు వెంటనే తల్లికి వందనం పథకాన్ని విడుదల చేయాలి.

- ప్రమీల, విద్యార్థి తల్లి, రాయచోటి.

పథకాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తల్లికి వందనం పథకం కింద ప్రతి తల్లికి రూ.15 వేలు వేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం పూర్తి విస్మరించింది. 100 రోజులు పైబడి అవుతున్నా సూపర్ సిక్స్ హామీలు తల్లికి వందనం పథకం నిబంధనలు, వాటి యొక్క అర్హతలు గాని ఏమాత్రం చెప్పకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 2025-26 సంవత్సరం నుంచి తల్లి వందనం పథకం అమలు చేస్తామని చెప్పడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

- ఎస్.నరసింహ, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, రాయచోటి.

ఉత్తర్వులు రావాలి



ప్రభుత్వం నుండి ఇంకా ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఏడాదిలో విద్యార్థులకు అటెండెన్స్ ప్రకారం ఇస్తారా లేదా అందరికి ఇస్తారా అనేది ఇంకా స్పష్టత రాలేదు. ఇంకా సమయం పడుతుంది.

- యు.శివ ప్రకాష్‌రెడ్డి, డిఇఒ, రాయచోటి.

వంద రోజుల ప్రణాళికను రూపొందించండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు రెండవ వంద రోజుల ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెండవ వంద రోజుల ప్రణాళికకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, గృహ నిర్మాణ, డిపిఒ, సిపిఒ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, లేబర్, టూరిజం శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలకు, 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలు డాక్యుమెంటరీ సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాల పైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ రూపకల్పన చేసుకుని, రానున్న రెండవ వంద రోజులు అనగా డిసెంబర్ 31వ తేదీ నాటికి నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలకు తీసుకోవలసిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31లోగా రెండవ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఆయా శాఖలలో అమలు చేయాల్సిన ప్రధానమైన కార్యక్రమాలు ఏమిటి, ప్రతి అంశానికి సంబంధించి వాటి పరిమితులు, వాటి ప్రధాన లక్ష్యం, ఉప లక్ష్యాలు, చేపట్టే, చేపట్టాల్సిన అంశాలు, వార్షిక లక్ష్యాలు ఎంత, ఇందులో సాధించాల్సిన భౌతిక, ఆర్థిక లక్ష్యం ఎంత, లక్ష్యసాధనకు తీసుకోబోతున్న చర్యలు తదితరాలలో శాఖల వారీగా జిల్లా అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై రివ్యూ నిర్వహించారు. రానున్న ఐదు సంవత్సరాల (2024-25 నుండి 2028-29)లో జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలి : ఎస్పి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి విద్యా సాగర్ నాయుడు

ప్రజాశక్తి- రాయచోటి

విద్యార్థులు స్నేహం భావంతో మెలగాలని ఎస్పి వి.విద్యా సాగర్‌నాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాగింగ్ మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలో సీనియర్లు జూనియర్ విద్యార్థులతో స్నేహభావంగా మెలగాలని, ర్యాగింగ్ రహిత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ర్యాగింగ్ కార్యక్రమాలకు పాల్పడితే పోలీసు శాఖ కేసులు నమోదు చేసి తద్వారా యువత విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు శాశ్వతంగా దూరమవుతారని తెలియజేశారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు కళాశాలలో సోదరుభావంతో, క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ కనబరిచి సమాజంలో గుర్తింపును సాధించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజా, కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనారోగ్యానికి గురై బరువు తగ్గడం, ఆందోళనకు గురికావడం, ఏకాగ్రత కోల్పోవడం, ఆకలి మందగించడం, వంటి దుష్ప్రభావాలకు గురి అవుతారని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారి కేంద్ర నాడీ మండల వ్యవస్థ అదుపుతప్పి అనారోగ్యానికి గురై ఆర్థికంగా, మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురై కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలవుతారని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజంలో మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. డిఎస్పి ఎం.ఆర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ర్యాగింగ్ 1997 ఆక్ట్ ప్రకారం నేరం రుజువైతే ఆరు నెలల నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని వివరించారు. కళాశాల ఆవరణలో ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం వలన జరిగే అనర్థాలను , విద్యార్థులు అవగాహన కోసం దృశ్య రూపంలో ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ విష సంస్కృతిని ప్రతి విద్యార్థీ బహిష్కరించి క్రమశిక్షణతో విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని అభిప్రాయపడ్డారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల రోడ్డు ప్రమాదాలు, క్షణికావేశంలో తీసుకునే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. మత్తుతో జీవితం చిత్తు అవుతుందని డ్రగ్స్ సేవించడం వల్ల నేరాలకు పాల్పడడం, స్నేహితులు, బాంధవ్యాలను మరిచి కుంగిపోయి ఆత్మహత్యలకు దారితీస్తుందని వివరించారు. మత్తుపదార్థాల వినియోగ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ర్యాగింగ్ మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్పిని, డిఎస్పిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో రాయచోటి రూరల్, అర్బన్ ఇన్‌స్పెక్టర్లు వరప్రసాద్, చంద్ర శేఖర్, పోలీసు సిబ్బంది, ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, ఎన్ఎస్ఎస్ అధికారి కరుణాకర్, వివిధ విభాగా ధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలి : ఎస్ఇ



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఫిర్యాదులు లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలని విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. రాజంపేట విద్యుత్ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట నందలూరు, రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లి, చిట్వేలి, రైల్వేకోడూరు మండల క్షేత్రస్థాయి అధికారులతో స్థానిక ఇఇ కార్యాలయంలో శనివారం ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు కేటాయించిన ప్రాంతాలలో నివాసం ఉంటే ఆశించిన మేర ఫలితాలు వస్తాయన్నారు. అధికారులు, సిబ్బంది సంబంధిత ప్రాం తాలలో విధిగా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, కేటాయించిన ప్రాంతాలలో నివాసం లేని వారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి మరొక నెల రోజులు గడువిచ్చి బిల్లు కట్టమంటుందని, అంటే మొత్తం రెండు నెలల గడువు వినియోగదారునికి ఇస్తుందని తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, దయ చూపించే స్థితిలో లేమని పేర్కొన్నారు. విద్యుత్ బకాయిలు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షలను తొలగించాలని ఆదేశించారు. మొండి బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీచేసి నిబంధన ప్రకారం వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్తు బకాయలు వసూలు చేయాలని సూచించారు. నెలవారి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. లో వోల్టేజి సమస్యలు రాకుండా తగినన్ని కొత్త ట్రాన్స్ఫర్ట్ చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృధా కాకూడదన్నారు. నిర్లక్ష్య ధోరణి వీడి లైన్ల వెంబడి తిరగాలని, తప్పులను గుర్తించి మరమ్మతులు చేయాలని, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు అడ్డు వచ్చిన కొమ్మలను కత్తిరించుకుని అంతరాయం లేని నాణ్యమైన నిరంతర విద్యుత్ ప్రజలకు అందించాలని తెలియజేశారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించాలని హెచ్చరించారు. ప్రతి ఒక్క సిబ్బంది నెలకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల చొప్పున నిర్వహణ పనులు చేయాలని ఆజ్ఞలు జారీ చేశారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటు, విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలను నిర్దశించుకుని పని చేస్తే ఫలితాలు అదుతేంగా ఉంటాయని సూచించారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

మండలంలోని అబ్బవరం గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ఇ-పంట నమోదు వివరాలను కలెక్టర్ శ్రీధర్ చామకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్బవరం గ్రామానికి చెందిన తరిగొండ శేషాద్రి సాగు చేసిన వేరుశనగ పంట నమోదు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఇ-పంట గురించి ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులతో మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ప్రతి రైతూ తమ పంటలను ఆన్‌లైన్‌ల నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్‌కు ఇ-పంట కార్యక్రమంపై వివిధ సూచనలను చేశారు. నిర్దేశించిన గడువులోగా వంద శాతం ఇ-పంట నమోదు పూర్తి కావాలని ఆదేశించారు. పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీలత, ఆ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు సెమినార్లు

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోవాలంటే వారి చేత వివిధ సెమినార్లు ఇప్పించాలని సిఎస్‌సి ప్రొఫెసర్ డాక్టర్ ఎ.పి.శివకుమార్ తెలిపారు. శనివారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ చాప్టర్ ఇనాగ్రేషన్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సిఎస్‌సి, సిఎస్‌సి(ఎఐ), ఇఇఇ, ఇసిఇ విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి స్టేజ్ ఫియర్ ఉండకూడదని తెలిపారు. స్టేజ్ ఫియర్ పోవాలంటే వారి చేత వివిధ సెమినార్లు ఇప్పించాలని తెలిపారు. వివిధ టెక్నికల్ కార్యక్రమాలలో పాల్గొనడం వలన వారికి స్టేజ్ ఫియర్ పోయి వివిధ ప్రోగ్రామింగ్ భాషల్లో పాండిత్యం పొందే దానికి ఈ సెమినార్లు ఉపయోగపడతాయని వివరించారు. ఐఎస్‌టిఇ జాతీయ స్థాయిలో అత్యున్నత స్థానంలో ఉన్న ఎటువంటి లాభా పక్ష లేకుండా ప్రొఫెషనల్‌గా టెక్నికల్‌గా విద్యను అందిస్తూ మన దేశంలో ముందు స్థానంలో ఉందని వివరించారు. విద్యార్థులు పర్సనాలిటీ డెవలప్మెంట్, కెరీర్ డెవలప్మెంట్ చేసుకునేలా ఐఎస్‌టిఇ ప్రిపేర్ చేస్తుందని వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ సెమినార్లలో పాల్గొని టెక్నికల్ ప్రోగ్రాంలో పాల్గొనడం వలన పర్సనాలిటీ డెవలప్మెంట్, కెరీర్ డెవలప్మెంట్ గురించి నేర్చుకోవడానికి ఐఎస్‌టిఇ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రొఫెషనల్, టెక్నికల్‌గా విద్యార్థులు అభివృద్ధి చెందే విధంగా ఐఎస్‌టిఇ మోటివేషన్ ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, ప్రొఫెసర్ డాక్టర్ డి.శివ శంకర్‌రెడ్డి, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



లోకేష్‌తో చమర్తి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ కేడర్‌కు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ సూచించినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన మోహన్‌రాజు తెలిపారు. శనివారం మంత్రి లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై లోకేష్ చర్చించి పలు సూచనలు చేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతినిత్యం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యతను ప్రతి నాయకుడు, కార్యకర్త తీసుకోవాలని, ప్రభుత్వ పథకాల అమలును ప్రతి ఒక్కరు దగ్గరుండి విజయవంతమయ్యేలా చేయాలని, రాజంపేట పార్లమెంటు పరిధిలోని టిడిపి నాయకులను కార్యకర్తలను ఎప్పటికప్పుడు చైతన్యపరిచి వారికి అండగా నిలవాలని, ముఖ్యంగా పార్టీ అధినేత ఆశయాలను, పార్టీ యొక్క సిద్ధాంతాలను తూచా తప్పకుండా అమలు చేయాలని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఐటియుసి నాయకులు, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ జి.కృష్ణమూర్తి తెలిపారు. ప్రపంచ రక్తదాన వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక వైఎస్ఆర్ కాలనీలో నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ, భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో భగత్ సింగ్ యువత 20 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మూర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ఓ ప్రాణాన్ని నిలబెట్టి నట్లేనన్నారు. ఎంతోమంది వివిధ కారణాలవల్ల రక్తలేమితో బాధపడుతుంటారన్నారు. ప్రమాదాల్లో గాయపడి తీవ్ర రక్తస్రావం అయినవారికి, కాన్పు సమయంలో స్త్రీలకు, శస్త్రచికిత్స సమ యంలోనూ ఇలా పలు రకాలుగా ఎంతోమంది రక్తం అవసరత ఉంటుందన్నారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరు ఆరు నెలలకొకసారి తప్పనిసరిగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భగత్ సింగ్ యువత కిరణ్, మురళి, హరీష్, కౌసిక్, శ్రీహరి పాల్గొన్నారు.



జిల్లా నాయకులను సన్మానిస్తున్న రెడ్డి సాహెబ్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొండంత.. అమలు చేసింది మాత్రం గోరంత.. సూపర్ సిక్స్ హామీలలో ఒక సిక్స్ మాత్రమే కొట్టిందని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ విమర్శించారు. శనివారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులను కలుసుకోవడానికి జిల్లా అధ్యక్షులు మొదటిసారి విచ్చేశారు. రెడ్డిసాహెబ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్‌లను ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో ఒక్క సిక్సర్ మాత్రమే కొట్టిందని మిగిలిన వాటిని అమలు చేయడంలో ఆలస్యానికి గల కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మహిళలను ఊరించిన ఉచిత బస్సు ప్రయాణం అటకెక్కిందన్నారు. తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారం చేపట్టిన వెంటనే ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తల్లికి వందనంపై స్పందన లేకపోవడాన్ని తప్పుపట్టారు. డిప్యూటీ సిఎం ఇప్పటికి సినిమా యాక్టరననే అనుకుంటున్నారని ఇందుకు సొంత శాఖలపైన ఇప్పటికీ పట్టు సాధించలేకపోవడమే నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడంతో పాటు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ వైస్ చెర్మన్ డాక్టర్ ఎస్.కె. బాషా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు మీనా కుమారి, నిమ్మనపల్లి, రామసముద్రం మండలాల అధ్యక్షులు ముబారక్ ఖాన్, ఖాదర్ బాషా, రవీంద్ర, సోమశేఖర్, ఈశ్వరమ్మ, శరత్ కుమార్ రెడ్డి, మహమ్మద్ అలీ, మహబూబ్ పీర్, ఆర్.నాగరాజు, పాలేటి, నాగరాజ, సోనులు పాల్గొన్నారు.

పోరుబాట

ప్రజా'దృష్టి'

జిల్లాలో ఉద్యమాల వేడి రగుల్కొంది. ఒకవైపు సిఐటియు నాలుగో తరగతి ఉద్యోగుల తరుపున కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తోంది. మరోవైపు వైవీయూ కేంద్రంగా తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ల నియామకాల్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు సమరశంఖాన్ని పూరించాయి. అంగన్వాడీలపై వేధింపులు, మున్సిపల్, ఆప్కాస్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఉద్యమిస్తోంది. సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్, మున్సిపల్ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. సిఐటియు చిరుద్యోగుల హక్కుల గొంతుకగా దశాబ్దాలుగా పోరాడుతోంది. కింది స్థాయి ఉద్యోగుల తరుపున గళాన్ని వినిపిస్తోంది. నిరంతర పోరాటాల ద్వారా కార్మికులు హక్కులను కాపాడుతోంది. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా అంగన్వాడీలు, ఆశాల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో కార్మికులు చేపట్టిన ఆందోళనలకు టిడిపి తరుపున సీనియర్ నాయకులు హాజరై సంఘీభావాన్ని ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకత్వం అంగన్వాడీలు, ఆశాలు, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. ఇదిలాఉండగా యోగి వేమన యూనివర్శిటీలో పోరాటం పట్టాలెక్కింది. ఇటీవల పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లోని ఓ యూనివర్శిటీలో తలెత్తిన విద్యార్థుల ఉద్యమం కారణంగా అక్కడి ప్రభుత్వమే కూలిపోయిన సంగతి తెలిసిందే. ఇటువంటి ప్రపంచ అనుభవాల స్ఫూర్తిని విద్యార్థి సంఘాలు ఆదర్శంగా తీసుకుని పోరాటం చేసి హక్కులను సాధించుకోవాలి. వైవీయూలో విసి, రిజిస్ట్రార్ల నియామకాల్ని వ్యతిరేకిస్తూ కొన్ని నెలలుగా విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తుండడం తెలిసిందే. రాష్ట్రంలోని పాలకుల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. ఇటీవల నియమితులైన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్లపై వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను విచారించిన అనంతరం ముందుకెళ్లాలి. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులను నియమిస్తే విద్యార్థినుల భవిష్యత్ ఆందోళనల్ని తొలగించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక నాయకత్వాలను యూనివర్శిటీలకు అందించాల్సి ఉంది. వైసిపి సర్కారు హయాం నుంచి కొనసాగుతున్న ఉల్లంఘనల పరంపరను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటు వంటి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కళంకితుల స్థానంలో ఉత్తమ నాయకత్వాలను అందించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు రాష్ట్ర సచివులను కలిసి వినతిపత్రాలను అందజేయడం వరకు పరిస్థితి వెళ్లడం విస్మయాన్ని కలిగిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ఉత్తమ సేవా అవార్డు అందుకున్న రఘురామయ్య

ఉత్తమ సేవకు పురస్కారం

ప్రజాశక్తి-వీరబల్లి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.రఘురామయ్యకు వైవియూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా అవార్డు అందు కున్నారు. యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వీరబల్లి జూనియర్ కళాశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన, కళాశాలలో పరిశుభ్రత, చెట్ల పెంపకం, స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నారని అన్నారు. వీధులు, మురుగునీటి కాలువలు శుభ్రం చేయడం, చెట్లు నాటడం, గ్రామాలలో నెలకొన్న సమస్యల పట్ల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన తేవడం, అర్హత కలిగిన వారికి ఓటరుగా నమోదు కావడం ఉమ్మడి కడప జిల్లాలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ద్వారా సమాజానికి సేవ చేయడం గుర్తించి అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. అవార్డు గ్రహీత రఘురామయ్య మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అన్నారు. గతంలో కూడా అన్ని రంగాలలో కళాశాల ముందంజ ఉంచడంతో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె


మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

మండలంలో పనిచేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయినట్లు ఎంపిడిఒ రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకుమండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి వెంగంవారిపల్లె నుంచి నిమ్మనపల్లె-1కు, మారెళ్ళ రెడ్డివారిపల్లె నుంచి రాచవేటివారి పల్లెకు, యర్రమల్లయ్య నాయుడు రెడ్డివారిపల్లె-1 నుంచి వాల్మీకిపురం కురవపల్లెకి బదిలీపై వెళ్లారని అన్నారు. నాగమల్లి సామకోటవారి పల్లె నుంచి బొమ్మనచెరువుకు, మంజుల అగ్రహారం నుంచి అంకిశెట్టి పల్లెకు, రెడ్డమ్మ తవళం నుంచి రామసముద్రం మినికికు బదిలీ కాగా, గాయత్రి మద్దికుంట పల్లె నుంచి రెడ్డివారిపల్లెకు, గౌతమి కదిరాయచెరువు నుంచి తవళంకు, శ్రీనాథ్ మద్దినాయునిపల్లె నుంచి అగ్రహారం పంచాయతీలకు బదిలీ అవుతున్నట్లు ఉత్తర్వులు అందాయని తెలిపారు. త్వరలో వీరందరూ వారికి కేటాయించిన పంచాయతీల బాధ్యతలను చేపట్టనున్నట్లు వివరించారు.

జయప్రకాష్ నియామకం హర్షణీయం

ప్రజాశక్తి-సుండుపల్లి


జయప్రకాష్

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిగా ఎస్.జయప్రకాష్‌ను నియమించడం పట్ల హెచ్‌డీఆఫ్యూ.పి.రెడ్డయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయప్రకాష్ తన పని తీరుతో మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. అన్నమయ్య జిల్లా సాంఘిక సమస్య అధికారిగా రావడం సంతోషంగా ఉందని అన్నారు. సాంఘిక సంక్షేమశాఖలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంపిడిఒగా మల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పుల్లంపేట



ఓబులవారిపల్లె మండల ఎంపిడిఒగా మల్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. మల్ రెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా రాయచోటి నుంచి ఓబులవారిపల్లెకి బదిలీ అయినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న విజయరావు పెనగలూరుకు బదిలీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదిక సమస్యలపై వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించి మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రజా సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి చేపడతామని చెప్పారు.

గాలివీడు ఎంపిడిఒగా జవహర్‌బాబు



గాలివీడు : ఎంపిడిఒగా సి.జవహర్‌బాబు బాధ్యతలు తీసుకున్నారు. సిద్ధవటంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి లింగాల ఎంపిడిఒగా బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసి లకు, ప్రజాప్రతినిధులకు ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫిక్ ఎస్ఐగా శివకామిని



ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఉమెన్ ఎస్ఐగా ఎన్. శివకామిని శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మదనపల్లెలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సిబ్బంది సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. డిఎస్‌పి కొండయ్య నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి-గాలివీడు

మహిళ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి మున్సిఫ్ కోర్టు జడ్జి ఫైజున్నీసా పేర్కొన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ బాలికలు, మహిళలు బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గృహ హింసకు పాల్పడే మహిళలు బయపడకుండా చట్ట పరంగా న్యాయ పోరాటం చేయవచ్చని సూచించారు. మహిళా సంక్షరణకు సంబంధించిన వనరులను ఉపయోగించుకోవాలని తెలిపారు.ప్రతి ఒక్కరి దగ్గర పోలీసు నంబర్లను తమ ఉంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైన బాల్య వివాహాలు చేస్తున్నట్లయితే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. పౌరులుగా మన బాధ్యతను సక్రమంగా నెరవేర్చు కుందామన్నారు. కార్యక్రమంలో రెడ్ సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, ఎస్ఐ అంజిరెడ్డి, సిసి శ్రీనివాసులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. **పీలేరు**:క్షేత్ర స్థాయిలో మహిళలు చట్టాల పట్ల అవగాహన పెంచుకో వాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్ తెలిపారు. శనివారం పీలేరు మండలం, తలుపుల సచివాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ సంయుక్తంగా విధాన్ సేసమాధాన్‌లో భాగంగా మహిళా విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ మహిళలు చట్టాల పట్ల అవగా హన కలిగి ఆత్మ స్థైర్యంతో తమను తాము రక్షించు కుంటూ ముందుకు సాగాలని అన్నారు. న్యాయవాదులు పూజారి యల్లయ్య, ఎం. రాణి పాల్గొని వివిధ మహిళా చట్టాలపై స్త్రీలకు అవగాహన అందించారు. కార్యక్రమానికి హాజరైన మహిళలందరికీ మండల న్యాయ సేవా ప్రాధికార సంస్థ ద్వారా భోజన ఏర్పాట్లు చేసి, న్యాయ సేవ ప్రాధికార సంస్థ జూట్ బ్యాగుతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సంఘాలు, ఐసిడిఎస్ సిబ్బంది, తలుపుల గ్రామ ప్రజలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


గాలివీడు : మాట్లాడుతున్న జడ్జి ఫైజున్నీసా

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

- గాయత్రీ మాతగా రెడ్డెమ్మ

ప్రజాశక్తి-గుర్రంకొండ



మండలంలోని చెర్లో పల్లి గ్రామంలోని రెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్న వరాత్రుల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు గాయత్రీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరి మళభరిత పుష్పాలతో శ్రీ అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కడపకు చెందిన నేతి బాల రెడ్డెయ్య ఉభయ దారులుగా వ్యవహరించారు. ఆదివారం నాలుగవరోజు అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు.**నిమ్మనపల్లి:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిమ్మనపల్లి పెద్దమాదిగ పల్లిలోని మాతమ్మ తల్లి రెండవ రోజు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనవి ఎచ్చారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. ఆలయాన్ని విశేష విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక పూలతో అలంకరించారు. **నందలూరు :** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మూడవరోజు గజలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయ అర్చకులు చెరుకుమిడి మృత్యుంజయశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం, నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్, కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్:** పట్టణంలోని నీరుగట్టువారిపల్లి నందు వెలసిన శ్రీచౌడేశ్వరి దేవి ఆలయంలో అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన శ్రీచౌడేశ్వరి అమ్మవారిని శ్రీకనకదుర్గ అలంకరణలో భక్తాదులు దర్శనం చేసు కొన్నారు. భక్తులకు ఉదయం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆల య ప్రధాన కార్యదర్శి బండి పవన్ కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలికిరి పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని జెఎన్‌టియు, పాలిటెక్నిక్, మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు నల్లారి కుటుంబం కట్టుబడి ఉందని అన్నారు. సహాయం చేయడానికి ఎల్లప్పుడూ నల్లారి కుటుంబం అందు బాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చిన నేరుగా నా దగ్గరికి నన్ను సంప్రదించవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధికి తోడ్పడి మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవ సంద ర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో విశ్వనా థరెడ్డి విఆర్‌రెడ్డి రఘునాథరెడ్డి, వెంకటరమణారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు శిక్షణ

ప్రజాశక్తి-కలకడ

క్రీడాకారులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు మోడం చంగల్ రాయుడు తెలిపారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హ్యాండ్ బాల్ క్రీడాకారులకు పీడీ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో దసరా సెలవులలో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల మదనపల్లి బీటీ కాలేజీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 20 మంది క్రీడాకారులకు శిక్షణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 11 వేల రూపాయలు విలువైన క్రీడా దుస్తులు తన సొంత డబ్బుతో విరాళంగా అందించారు.

నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-కలికిరి

నూతన వ్యవసాయ పద్ధతులతోనే అధిక ఆదాయం లభిస్తుందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల రైతులకు సూచించారు. కలికిరిలో శనివారం ప్రధానమంత్రి కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో 18 వ విడత పంట సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారని తెలిపారు. మన ప్రాంతా రైతులు కృత్రిమ పురు గుమందులు, తెగుళ్ల మందుల వాడకంపై ఖర్చు తగ్గించి, నూతన వంగడాలు సాగు చేస్తూ సేంద్రీయ పద్ధతులను అవలంబిస్తే అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మనం రోజు తినే పండ్లు, కూరగాయలు, ఆహార ధాన్యా లలో పోషక విలువలు పెంచి, పురుగు మందుల అవశేషాలు లేకుండా చేయడానికి రైతులు వారికున్న పొలంలో కనీసం కొంత పొలంలో సేంద్రీయ వ్యవసాయాన్ని పాటించాలని కోరారు. సేంద్రియ వ్యవ సాయ పద్ధతులను పాటిస్తున్న రైతులు సుబ్రహ్మణ్యం (గుట్టపాలెం గ్రామం), శశి (చింతపర్తి), స్వాతి, ఆనంద్ (అయ్యవారిపల్లి) సేంద్రీయ వ్యవసాయంపై తమ ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ప్రతి రైతు సేంద్రీయ వ్యవసాయం మొగ్గుచూపితే కాలుష్యం కాని కూరగాయలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

టిడిపి నేత కొండ్రెడ్డి అరెస్టు

- పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన అనుచరులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/తంబళ్లపల్లి

తంబళ్లపల్లి రెవెన్యూ అధికారులను దుర్భాషలాడినందుకు రాష్ట్ర టిడిపి కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని దిగువపాళ్యం పంచాయతీ అన్నగారిపల్లిలో అంగన్వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఈ స్థలంలో గ్రామంలో వున్న పలువురు ఆక్రమించుకొని గొర్రెలకు షెడ్డు, దిబ్బలు వేసుకున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని కొన్ని రోజుల ముందు పంచాయతీ, రెవిన్యూ అధికారులు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా దిబ్బలు, గొర్రెల షెడ్లు తొలగించి శుభ్రపరిచారని అన్నారు. అనంతరం మళ్లి ఆక్రమణ దారులు ఆ స్థలంలో షెడ్లు, దిబ్బలు వేయడం ప్రారంభించారని అన్నారు. దీనిపై స్థానిక సర్పంచ్, స్థానికులు కాలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం అక్రమణలు తొలగించడానికి వెళ్లిన రెవెన్యూ అధికారును, విఆర్ఒ, సర్వేయర్‌ను దుర్భాషలాడారని అన్నారు. తహసిల్దార్ హరి కుమార్ ఫోన్ చేసి ఆయనపై దురుసుగా ప్రవర్తించారని అన్నారు. తహశీల్దార్ పిర్యాదు చేయగా కొండ్రెడ్డితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొలకలచెరువు సీఐ రాజా రమేష్, ఎస్ఐ గాయత్రీలు కొండ్రెడ్డిని ఇంట్లో ఉండగా అరెస్టు చేసి మదనపల్లెకు తరలించినట్లు తెలిపారు.

తంబళ్లపల్లి టిడిపి నాయకుడు కొండ్రెడ్డి స్థానిక తహశీల్దారు పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అభియోగంపై శనివారం మదనపల్లె రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న కొండ్రెడ్డి అనుచరులు, టిడిపి శ్రేణులు మూడు వందలమందికి పైగా ఒక్కసారిగా పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. తమ నాయకున్ని తక్షణమే వదిలిపెట్టాలని ఆందోళన చేశారు. పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని హంగామా చేశారు. ఆందోళన తీవ్ర తరం కావడంతో వారిని అదుపు చేయడం పోలీసుల వల్ల కాలేదు. పరిస్థితి చేయి దాటి శాంతి భద్రతలు అదుపుతప్పే పరిస్థితి తలెత్తడంతో పోలీసులు అదుపులో ఉన్న కొండ్రెడ్డిని విడిచి పెట్టారు.

సామాజిక తనిఖీల్లో రూ.1.82 లక్షల రికవరీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామపంచాయతీలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సామాజిక తనిఖీ నిర్వహించగా రూ.1.82 లక్షలు రికవరీ గుర్తించినట్లు ఎస్ఆర్పి సుబ్బారావు అన్నారు.శనివారం ఆయన మండలంలోని స్థానిక ఉపాధి హామీ పథక కార్యాలయం ఆవరణలో 13 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఓపెన్ ఫోరం ఏపీడి ప్రతాప్ ఎస్ టి యం లోకేశ్వరమ్మ,విజిలెన్స్ అధికారి సుధాకర్‌లతో కలిసి ఆయన ఓపెన్ ఫోరం నిర్వహించారు.సామాజిక తనిఖీ నిర్వహించి 13 గ్రామ పంచాయతీలకు గాను రూ.1.82 లక్షలు రికవరీ గుర్తించినట్లు తెలిపారు.. కార్యక్రమంలో ఎంపిడిఒ జాషువా, డిఆర్‌పిలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం పాలనాధికారిగా గౌస్‌బాషా

ప్రజాశక్తి- రామసముద్రం : మండల అభివృద్ధి కార్యాలయ పాలనాధికారిగా గౌస్‌బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎఒ శ్రీనివాసులు గత నెలలో హఠాన్మరణం చెందగా అతని స్థానంలో గౌస్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం : డిసిసి

ప్రజాశక్తి-గుర్రంకొండ

రాహుల్ గాంధీని ప్రధాని మంత్రి చేయడం కొరకు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మండల పార్టీ అధ్యక్షులు సమీరుద్దీన్ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా, షర్మిలను వైఎస్ ముఖ్యమంత్రిగా చూడటమే మన ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఎపిసిసి సెక్రటరీ అల్లాభక్షు, చెన్నకేశవ, ప్యారుఖాన్, అర్షద్, గౌస్ పీరా, సమీద్, ఆదిల్, ధనుంజాయ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.1.28 కోట్లు జమ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పిఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా రైతులకు 18వ విడత నిధులనుప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేసినట్లు తెలిపారు. విడుదల చేసిన పిఎం కిసాన్ నిధులు రూ.2వేలు యథావిధిగా అర్హులైన ప్రతి రైతుల ఖాతాలోకి జమవుతాయని అన్నారు. నిమ్మనపల్లి మండలంలో రూ.1.28 కోట్ల లను అర్హులైన 6449 మంది రైతులు లబ్ధి పొందడం జరిగిందన్నారు. ఈ నిధులను రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



నిమ్మనపల్లి మండల డిప్యూటీ తహశీల్దార్‌గా జి.శ్రీనివాసరావు శని వారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ధనంజయలును కలిసి బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న డిటి తపస్విని కురబలకోట మండలానికి బదిలీ కాగా రామసముద్రం మండలంలో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు నిమ్మనపల్లి డిటిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవిన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి విఆర్ఒలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఐటితో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-కలకడ

ఐటితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ మలం షావలి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఐటి రంగంలో ప్రావీణ్యం పొందడానికి పది రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఒకేషనల్ కో-ఆర్డినేటర్ ప్రతాప్, ఒకేషనల్ ట్రైనర్ విష్ణువర్ధన్ పాల్గొంటారని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గత నెలలో వరదల కారణంగా సర్వం కోల్పోయిన విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలకి బి.కొత్తకోట పట్టణం రంగసముద్రం రోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆపన్న హస్తం అందించారు. శనివారం ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ ఆధ్వర్యంలో పోగుచేసిన రూ.35 వేల చెక్కును రవాణా,యువజన,క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి అందించారు. ఈ సంద్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక సేవలో కళాశాల యాజమాన్యం వరద బాధితులకు సహాయం అందించడం అభినందనీయమని అన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్, కోర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో శనివారంపీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఆవరణంలో మీకు తెలుసా అనే పేరుతో హెచ్ఐవి, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు హెచ్ఐవి, ఎయిడ్స్ గురించిన ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపవద్దని, వారు ప్రశాంతంగా జీవించడానికి సహకరించాలని తెలిపారు. ఎయిడ్స్ ప్రివెన్షన్ యాక్ట్ 2017, అలాగే హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి మరిన్ని వివరాలకు 1097 నెంబరుకు కాల్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఔట్ రీచ్ వర్కర్లు కె. రాజమ్మ, షర్మిల, రెడ్డి రాణి పాలొన్నారు.

జాతీయ జట్టుకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

ప్రజాశక్తి-పుల్లంపేట


మధులత

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మధులత జాతీయ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైందని పీడీ నీలకంఠరావుతెలిపారు. ఈనెల 2 నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరచి జాతీయ జట్టులో స్థానం సంపాదించకుందని అన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారిని త్వరలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌జిఎఫ్ అండర్-19 సెక్రటరీ శారద, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మధులతకు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానస్పదస్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లెలో వెలుగు చూసింది. తాలూకా సిఐ కళా వెంకట్రమణ కథనం మేరకు..తట్టివారిపల్లె సమీపంలోని ఎర్రగానిమిట్ట, బియన్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న సునీత(45) చలపతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే సునీత భర్తను వదిలి రమేష్ అనే వ్యక్తితో రెండో వివాహం చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలకు వివాహాలు అయిపోయి బెంగుళూరులో స్థిరపడ్డారని తెలిపారు. సునీత రెండో భర్త రమేష్‌ను వదిలి బిఎన్ రెడ్డి కాలనీలో ఒంటరిగా ఉంటూ స్థానికంగా ఉన్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తితో చనువుగా ఉండేదన్నారు. మూడురోజుల క్రితం లక్ష్మి నారాయణ, మృతురాలు సునీత లు గొడవ పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ సమయంలో ఏమి జరిగిందో ఏమో సునీత తను ఉన్న ఇంట్లోనే శవమై కనిపించిందని అన్నారు. ఎవరూ గమనించక పోవడంతో శవం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో స్థానికుల సమాచారంతో ఎస్ఐ చంద్రమోహన్, ఎఎస్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకొని మృతురాలి పిల్లలకు సమాచారం ఇచ్చారని అన్నారు. బెంగుళూరులో ఉన్న మృతురాలి కుమార్తె మానస ఇక్కడికి వచ్చి తల్లితో చనువుగా ఉంటున్న లక్ష్మి నారాయణపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

ఎర్రచందనం దుంగలు, కారుతో సహ దొంగను అరెస్టు చేసినట్లు పీలేరు అర్బన్ సిఐ పి. యుగంధర్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పీలేరు మండలం, పొంతల చెరువు క్రాస్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. రాయచోటి వైపు నుంచి ఇన్నోవా కారు అత్యంత వేగంగా రావడానికి గుర్తించి వెంబడించినట్లు చెప్పారు. సిగ్నల్ ఇచ్చినా, డ్రైవర్ ఆ వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు తీసుకువెళ్లాడని అన్నారు. వాహనాన్ని వెంబడించగా డ్రైవర్, వాహనం పొంతల చెరువు క్రాస్ సమీపంలోని చెరువు కట్టపై ఆపి డ్రైవర్ అందులోంచి దూకి పరారయ్యాడన్నారు. అదే వాహనంలోని మరో వ్యక్తి కూడా పారిపోతుండగా అతన్ని అదుపులోకి తీసుకుని, 4 ఎర్రచందనం దుంగలు, ఇన్నోవా కారు, సెల్ ఫోన్, రూ.1500లు నగదు స్వాధీనం చేసు కున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.12.13లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన నింది తుడు అప్పాస్వామి సామికన్ను (25)ను కోర్టులో హాజరు పరిచామని, పారారైన డ్రైవర్, మిగిలిన కూలీలను కూడా త్వరలోనే పట్టుకుని రిమాండ్‌కు పంపుతామన్నారు.


స్వాధీనం చేసుకున్న దుంగలు, కారు, నిందితుడిని చూపుతున్న పోలీసులు